క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పేర్నమిట్టలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సంతనూతలపాడు: మండలంలోని పేర్నమిట్ట హైస్కూల్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, సమతానగర్, నవాబుపేట, విరాట్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, సంతనూతలపాడు నియోజకవర్గ ఎన్నికల అధికారి (ఈఆర్వో) ఎస్.వరకుమార్, సంతనూతలపాడు తహసీల్దార్ ఎస్.ఎల్.నారాయణరెడ్డి, బీఎల్‌ఓలు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు, విద్యుత్, తాగునీరు, టాయిలెట్ సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో వీఆర్వో రవికుమార్, ఎన్నికల ఆపరేటర్లు కే అనిల్, పి.అనిల్‌కుమార్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

256 మందికి ఉచిత వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కొత్తపట్నం: మండలంలోని అల్లూరు గ్రామంలో అరుణ్ జ్యోతి కాలనీలో కిమ్స్ హాస్పిటల్ డాక్టర్లతో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి 256 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కొందరికి దీర్ఘకాలిక వ్యాధులు బయటపడటంతో మెరుగైన వైద్యం కోసం హాస్పిటల్‌కు తరలించారు. వెల్ఫేర్ అసోసియేషన్ ఫర్ అర్ఫాన్స్ ఓల్డర్ అండ్ విడోస్ అధ్యక్షుడు దరిసిగుంట పాలు వైద్య శిబిరాన్ని ప్రారంభించగా, డాక్టర్ రామాంజనేయులు, డాక్టర్ రత్నకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ప్రక్రియను నిలిపివేయాలి

ఒంగోలు వన్‌టౌన్: రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త బీఆర్ గౌస్ ప్రభుత్వాన్ని కోరారు. ఒంగోలులోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న సమయంలో టీడీపీ నాయకుడు లోకేష్ స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించారని గుర్తుచేశారు. కానీ, అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్లను యుద్ధప్రాతిపదికన కమర్షియల్ వినియోగదారులకే కాకుండా గృహ వినియోగదారులకు కూడా అమర్చుతుండటం దారుణమన్నారు. ప్రభుత్వం ప్రైవేటు సంస్థ అయిన అదానీ గ్రూపుతో కలిసి స్మార్ట్ మీటర్లు అమర్చడం అన్యాయమన్నారు. ప్రీపెయిడ్ మీటర్ల పేరుతో ముందుగానే ప్రజల నుంచి నగదు వసూలు చేసుకుని ఆ నగదుతో వ్యాపారం చేసేందుకు ఇదంతా చేస్తున్నారన్నారు. వేల కోట్ల రూపాయల ఆస్తులను అదానీ గ్రూపునకు ప్రభుత్వం కట్టబెడుతోందన్నారు. విలేకరుల సమావేశంలో పీసీసీ ఎస్సీ విభాగం కో చైర్మన్ వి.మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు ఇంద్ర బస్సులు ఏర్పాటు చేయాలి

కంభం: గిద్దలూరు నుంచి కంభం, మార్కాపురం మీదుగా హైదరాబాద్ వెళ్లేందుకు ఏపీఎస్ఆర్టీసీ ఇంద్ర బస్సు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని శుక్రవారం విజయవాడలో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు వినతి పత్రం ఇచ్చినట్లు షెడ్యూల్ కులాల పరిరక్షణ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు కాటమాల చెన్న కేశవరావు ఓ ప్రకటనలో తెలిపారు. గిద్దలూరు, కంభం నుంచి రోజూ సుమారు 500 మంది వరకు ఉద్యోగాలు, వివిధ పనుల నిమిత్తం హైదరాబాద్ వెళ్తుంటారని, ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు గిద్దలూరు డిపో నుంచి రెండు ఇంద్ర బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ ఎండీని కోరినట్లు వివరించారు.

ఖాళీ సచివాలయం..!



ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న బండ్లమూడి సచివాలయం

చీమకుర్తి రూరల్: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవగా, కొత్తగా చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలేవీ లేకపోగా, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సాధించిన ప్రగతి ఫలాలు సైతం ప్రజలకు అందకుండా చేస్తోంది. ప్రధానంగా సచివాలయాల వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ వస్తోంది. సచివాలయాల ద్వారా గత ప్రభుత్వంలో 500కుపైగా సేవలందించగా, ప్రస్తుతం వాటి సంఖ్యను భారీగా కుదించింది. సచివాలయాల ద్వారా ప్రజలకు సక్రమంగా సేవలందించకుండా సంబంధిత సిబ్బందిని పక్కదారి పట్టిస్తోంది. ఫలితంగా సచివాలయాల్లో సక్రమంగా సిబ్బంది ఉండటం లేదు. ప్రజలకు మెరుగైన సేవలు అందడం లేదు. శుక్రవారం ఉదయం 11 గంటలైనా చీమకుర్తి మండలంలోని బండ్లమూడి సచివాలయం ఖాళీగా దర్శనమివ్వడమే ఇందుకు నిదర్శనంగా ఉంది. సచివాలయ సిబ్బంది సమయానికి కార్యాలయానికి రాకపోవడం, అందుబాటులో ఉండకపోతుండటంతో వివిధ పనులపై అక్కడకు వస్తున్న ప్రజలు అవస్థపడుతున్నారు. రోజుల తరబడి తమ పనులు మానుకుని సచివాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాదిరిగా సచివాలయాల ద్వారా అన్ని రకాల సేవలు మెరుగ్గా అందేలా ప్రభుత్వం, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గోతులమయం..!

చీమకుర్తి రూరల్: చీమకుర్తి తూర్పు బైపాస్ కూడలిలో రహదారి మొత్తం గోతులమయంగా మారింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవగా, రోడ్ల మరమ్మతుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. గత సంక్రాంతి పండుగ నాటికి రహదారులన్నింటికీ మరమ్మతులు పూర్తిచేసి నున్నగా తయారు చేస్తామని సీఎం చంద్రబాబు చెప్పిన మాటలు మండలంలో ఆచరణకు నోచుకోలేదు. కొన్నిచోట్ల పైపైన మట్టితోలి నామమాత్రంగా గోతులను పూడ్చడంతో మూడు నెలలు తిరగకుండానే మళ్లీ అధ్వానంగా తయారయ్యాయి. చీమకుర్తి తూర్పు బైపాస్ కూడలిలో కంకర మొత్తం లేచిపోవడంతో పాటు గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రాత్రివేళల్లో ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షాలు కురిస్తే పరిస్థితి దారుణంగా మారుతుండటంతో భయపడుతున్నారు. కూటమి పాలకులు, అధికారులు వెంటనే స్పందించి రహదారుల మరమ్మతులపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



చీమకుర్తి తూర్పు బైపాస్ కూడలిలో అధ్వానంగా ఉన్న రోడ్డు

ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

ఒంగోలు సిటీ: స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ) శుక్రవారంతో ముగిసింది. విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీగాయత్రి ఆధ్వర్యంలో కళాశాలలోని ఆర్యభట్ట సెమినార్ హాల్లో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కళాశాల డీన్ ఆఫీస్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ (ఎన్ఐటీటీఆర్) చెన్నై వారు సంయుక్తంగా నిర్వహించిన ఎఫ్‌డీపీలో పెడగాగి స్ట్రాటజీస్ ఫర్ – 21 సెంచరీ అనే అంశంపై అధ్యాపకులకు అవగాహన కల్పించారు. ఎన్ఐటీటీఆర్‌కు చెందిన ప్రొఫెసర్ కె.ఎస్.గిరిధరన్, డాక్టర్ ఎం.అనిల్‌కుమార్ మూడు రోజుల పాటు ఫ్యాకల్టీకి అవగాహన కల్పించారు. డాక్టర్ సెల్వం రెండు రోజుల పాటు రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకుల బృందం

ప్రస్తుతం మారుతున్న ట్రెండ్స్, విధానాన్ని బట్టి టీచింగ్‌లో రావాల్సిన మార్పులు, విధానాలను ఈ ఐదు రోజుల కార్యక్రమంలో వివరించారు. క్విస్ ఇంజినీరింగ్ కళాశాల డీన్ అకడమిక్స్ డాక్టర్ సత్యమెహర్ పర్యవేక్షించగా, ముగింపు కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి.హనుమంతరావు అధ్యక్షత వహించారు. కళాశాల హెచ్‌వోడీలు, డీన్‌లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

- ఎంఈఓలు ఆంజనేయులు, శ్రీనివాసరావు

మద్దిపాడు: మండలంలోని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచుకోవాలని ఎంఈఓలు ఎంవీఆర్ ఆంజనేయులు, ఎం.శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. ఐదో తరగతి చదివిన విద్యార్థులు ఆరో తరగతి ఎక్కడ చేరుతున్నారో వివరాలు సేకరించాలన్నారు. అదే విధంగా పదో తరగతి పూర్తయిన విద్యార్థులు ఇంటర్‌లో ఏయే కళాశాలల్లో చేరుతున్నారో ఆయా ప్రధానోపాధ్యాయులు వివరాలు సేకరించాలని తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్ నుంచి ప్రాథమిక పాఠశాలల్లో చేరుతున్నారా.. లేదా..? అనే విషయాలను కూడా నమోదు చేసుకుని పక్కాగా రికార్డు నిర్వహించుకోవాలన్నారు. పాఠశాలలో వంట చేసే ప్రదేశం పరిశుభ్రంగా ఉండాలని,



సమావేశం నిర్వహిస్తున్న ఎంఈఓలు ఆంజనేయులు, శ్రీనివాసరావు

అదే క్రమంలో మధ్యాహ్న భోజనం పథకాన్ని మెనూ ప్రకారం నిర్వహించాలని సూచించారు. జిల్లా స్థాయి ఉన్నతాధికారుల నుంచి కమిషనర్ వరకూ ఏదో ఒక సమయంలో తనిఖీలు చేస్తారని, అందువలన ప్రధానోపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని వారు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్యక్రమాల పరిశీలన

సంతనూతలపాడు: మండలంలోని చంద్రపాలెం, తక్కెళ్లపాడు, గుమ్మలంపాడు గ్రామాల్లో పారిశుధ్య పనులను శుక్రవారం సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబు పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులకు సలహాలు, సూచనలు చేశారు. గుమ్మలంపాడు గ్రామంలో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యదర్శులు మౌనిక, జయశంకర్, ఈశ్వర్‌రెడ్డి, గ్రామ నాయకులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

చీమకుర్తి రూరల్: మండలంలోని బండ్లమూడి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ చీమకుర్తి వారి ఆధ్వర్యంలో శుక్రవారం పుస్తకాలు, నోట్‌బుక్స్, ఇతర విద్యా సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమానికి హెచ్‌ఎం హనుమంతరావు అధ్యక్షత వహించగా, ఎంఈఓలు నరసింహారావు, శివాజీ పాల్గొని మాట్లాడారు. పిల్లలను పనికి కాకుండా బడికి పంపాలని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పి.భాస్కర్‌శాస్త్రి, కడువా రామకృష్ణ, కేవీ సుధాకర్, పి.రామకృష్ణారెడ్డి, పరాంకుశం శ్రీనివాసమూర్తి, ఎ.వీరిరెడ్డి, అనిల్, కాంతారావు, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీల ఏర్పాటుకు కసరత్తు



మద్దులూరు నాయకులతో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, యలమందారెడ్డి

సంతనూతలపాడు: మండలంలోని అన్ని గ్రామాలకు వైఎస్సార్ సీపీ కమిటీలు ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, నాయకుడు దుంపా యలమందారెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం మద్దులూరులోని గ్రామ నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అన్ని గ్రామాల్లో కమిటీల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ కమిటీల్లో పదవులు పొందిన నాయకులు పార్టీని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను వివరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుబ్బయ్య, నాయకులు అలికెపల్లి రమణారెడ్డి, ఇరగల వంశీకృష్ణారెడ్డి, కృష్ణంనేని సుబ్బారావు, మునగాల రమణారెడ్డి, కమలహాసన్, మునగల కిట్టయ్య, తన్నీరు మోహన్‌రావు, కరుకు సుబ్బారావు, వల్లెపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు సహకరించాలి

మద్దిపాడు: గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహించి మెరుగుపరిచేందుకు సర్పంచ్‌లు సహకరించాలని ఎంపీడీఓ డీఎస్‌వీ ప్రసాద్, ఈఓపీఆర్‌డీ రఘుబాబు కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ద్వారా గ్రామాల్లో పారిశుధ్య పనులపై ప్రజల అభిప్రాయాలు సేకరిస్తోందని తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారన్నారు. గ్రామ కార్యదర్శులు ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 9 గంటల వరకూ గ్రామాల్లో చెత్త సేకరించే కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతేగాకుండా శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మురుగు కాలువల్లో పూడిక తీయడం, చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్లకు చేర్చడం వంటి కార్యక్రమాలు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే నెల 10వ తేదీ ఐవీఆర్ఎస్‌లో వచ్చే స్పందన సానుకూలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాబు, పీఆర్ ఏఈ రవి, సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రసాద్

ఘనంగా జగన్నాథ ఆలయ వార్షికోత్సవం



ఆలయం వద్ద మహిళల కోలాట ప్రదర్శన

మార్కాపురం టౌన్: మార్కాపురం మండలంలోని రాయవరం(ఆర్ఎస్) వద్ద కొలువై ఉన్న బలబద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు పురుషోత్తమాచార్యులు, లక్ష్మణచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ఉభయ దేవేరులతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి కల్యాణం, అనంతరం శాంతి హోమం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. సాయంత్రం మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు గుంటక వనజాక్షి ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన భక్తులను అలరించింది. రాత్రికి స్వామివారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

అంగన్‌వాడీ సెంటర్ ఆకస్మిక తనిఖీ



చిన్నారులతో ముచ్చటిస్తున్న ఐసీడీఎస్ పీడీ సువర్ణ

మద్దిపాడు: మండలంలోని లింగంగుంట అంగన్‌వాడీ సెంటర్‌ను ఐసీడీఎస్ పీడీ ఎస్.సువర్ణ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సెంటర్‌లోని రికార్డులు పరిశీలించారు. సెక్టార్ మీటింగ్ జరుగుతున్న క్రమంలో సెంటర్‌కు గర్భిణులు, బాలింతలు రావడంతో వారితో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. టేక్ హోం రేషన్ ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. చిన్నారులతో ముచ్చటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, 3 నుంచి 6 సంవత్సరాల చిన్నారులకు ఫేస్ క్యాప్చర్, ఈకేవైసీ 100 శాతం చేసి టేక్ హోం రేషన్ ఇవ్వాలని అంగన్‌వాడీ వర్కర్లకు సూచించారు. లబ్ధిదారులకు వచ్చే ఓటీపీలు యాప్‌లో నమోదు చేయడానికి సహకరించాలని కోరారు. సీడీపీఓ ఇవాంజిలిన్, కో ఆర్డినేటర్ ఎస్.వెంకట్, సూపర్‌వైజర్లు జ్యోతి, పద్మావతి, సెక్టార్‌లోని అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

స్కూల్ బస్సు ప్రమాదాల నివారణ బాధ్యత యాజమాన్యాలదే..

- పాఠశాలల యజమానుల సమావేశంలో సీఐ సుబ్బారావు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో స్కూల్ బస్సులు ప్రమాదాలకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత యాజమాన్యాలు, డ్రైవర్లపై ఉందని సీఐ సుబ్బారావు పేర్కొన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో మార్కాపురం పట్టణంలోని వివిధ ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. స్కూల్ బస్సుల్లో భద్రతా లోపాలను సరిదిద్దాలని చెప్పారు. బస్సుల్లో ప్రథమ చికిత్స కిట్లు, పాఠశాలల్లో అగ్ని ప్రమాదాల నివారణ సామగ్రి ఉండాలని స్పష్టం చేశారు. విద్యార్థినులకు గుడ్‌టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పట్టణంలో స్కూల్ బస్సులు నెమ్మదిగా నడపాలని డ్రైవర్లకు సూచించారు. సమావేశంలో ఎస్సైలు రాజమోహన్‌రావు, సైదుబాబు, అహరోన్ తదితరులు పాల్గొన్నారు.

వారాహి అమ్మవారికి సారె సమర్పణ



వెంకటేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు



వారాహి అమ్మవారికి సారె సమర్పిస్తున్న మహిళా భక్తులు

ఒంగోలు మెట్రో: వారాహి అమ్మవారి నవరాత్రులను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఒంగోలు మంగమూరుడొంక శ్రీ గాయత్రి అమ్మవారి దేవస్థానంలో, లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని శుక్రవారం వారాహి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులతో మహిళా భక్తులు సారె సమర్పించారు. కేశవస్వామిపేటలోని చెన్నకేశవస్వామి దేవస్థానంలో ఉపాలయంగా ఉన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారికి శుక్రవారాభిషేకాన్ని నేత్రపర్వంగా జరిపించారు. అగ్నిహోత్రం, అభిషేకం జరిపించి స్వామివారికి పంచహారతి, కుంభ హారతి, కర్పూర హారతులు అందజేశారు. విశేషంగా తరలివచ్చిన భక్తులకు అభిషేక జలాలను ప్రోక్షణ చేసి తీర్థ ప్రసాదాలుగా అర్చకులు అందజేశారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి రావెళ్ల శివశంకర్, సిబ్బంది పర్యవేక్షించారు.